క్లుప్తంగా

అడ్డుగా ఉన్న తీగలను తొలగించాలని వినతి



నెల్లూరు(బృందావనం): వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే గణేశ్ విగ్రహాల నిమజ్జనం సాగే రహదారుల్లో అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి నేతలు కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, కోశాధికారి మోహన్‌రావు, విజయకుమార్, హర్షవర్ధన్, హరికృష్ణ, జయచంద్ర, జగన్‌మోహన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మరో 130 మందికి అక్రిడిటేషన్లు




నెల్లూరు (దర్గామిట్ట): ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో మరో 130 మంది పాత్రికేయులకు అక్రిడిటేషన్లు మంజూరయ్యాయి. ఈ మేరకు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ రెండో సమావేశంలో కలెక్టర్ హరినారాయణన్ నిర్ణయం తీసుకున్నారు. నిబంధనల మేరకు డాక్యుమెంట్లు సమర్పించిన చిన్న, పెద్ద పత్రికలు, పీరియాడికల్స్, కేబుల్ చానెళ్లకు కమిటీ మంజూరు చేసింది. అక్రిడిటేషన్లు పొందిన జర్నలిస్టులు హెల్త్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మస్తాన్‌రెడ్డి (సాక్షి), వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, కెమెరామెన్ మాల్యాద్రి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, జిల్లా కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్టీసీ ఆర్ఎం శేషయ్య, హౌసింగ్ పీడీ నాగరాజు, ఏఈఐఈ కిషోర్, పీఆర్వోలు రమేష్, రవీంద్ర, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఐపై వర్క్‌షాపు



నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్ర ధనుష్ (ఐఎంఐ) 5.0 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశించారు. సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ఐఎంఐపై బుధవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో ఇచ్చి మీజిల్స్, రూబెల్లా వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. గుర్తించిన వారికి మూడు విడతల్లో నిర్దేశించిన తేదీల్లో వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని చెప్పారు. ప్రతి నెలా 14న నిర్వహించనున్న ఆరోగ్య మేళాను విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఐఎంఐపై సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ భవాని శిక్షణ ఇచ్చారు. డీఎల్ఏటీఓ డాక్టర్ బ్రిజిత, ఎఫ్‌పీసీ నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, డెమో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ముఖాముఖి



నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఐఏఎస్ అకాడమీలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని 2021 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ మినీ శుక్లా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రణాళికబద్ధంగా చదివితే సివిల్స్‌లో విజయం సాధించొచ్చని చెప్పారు. ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూపును ఎంపిక చేసుకొని సన్నద్ధమైతే విజయం సాధించొచ్చని తెలిపారు. అకడమిక్స్‌తో పాటు బృంద చర్చలు, సెమినార్లలో పాల్గొనడం ద్వారా విషయ పరిజ్ఞానంతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, డీజీఎం మహేష్, ఏజీఎం సుధీర్, ప్రిన్సిపల్స్ సరోజాదేవి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



యూపీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, సునీత

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 22వ డివిజన్లో రూ.2.12 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను బుధవారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని కుష్టు హాస్పిటల్ ఆవరణలో నిర్మించిన వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంజూరైన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. 22వ డివిజన్లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీ మాట్లాడారు. నాడు – నేడు పథకం ద్వారా పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వస్తున్నాయని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులను సీఎంను కోరగా, రూ.62 కోట్లను కేటాయించారని వివరించారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. అన్ని ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా పాటుపడుతున్నానని.. రౌడీయిజం, ఘర్షణలు, భూ కబ్జాలను ఏ మాత్రం సహించబోనని స్పష్టం చేశారు. ప్రజల ఆస్తులకు పూర్తిగా భద్రత కల్పిస్తానని హామీ ఇచ్చారు. నగర శివారు ప్రాంతాల్లో లే అవుట్లు వేసే వారు పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించాకే అనుమతులు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు.

లోకేశ్ విమర్శలు అర్థరహితం

యువగళం పేరిట నారా లోకేశ్ పర్యటిస్తూ, తమ పార్టీ ఎమ్మెల్యేలపై చేస్తున్న విమర్శలు అర్థరహితమని ఎంపీ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని టీడీపీ నేతలు రాసిచ్చిన స్లిప్పుల్లో ఉండేది చదువుతూ తమ పార్టీ ఎమ్మెల్యేలు వందలాది కోట్ల అక్రమ సంపాదనకు పాల్పడ్డారని ఆరోపించడం తగదని హితవు పలికారు. టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి.. భవిష్యత్తులో వారు చేపట్టబోయే పనులను సభల్లో చెప్తే బాగుంటుందని సూచించారు.

వలంటీర్లపై వ్యాఖ్యలు బాధాకరం

వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు అన్ని వర్గాల ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నారని చెప్పారు. పార్టీ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు మూలె విజయభాస్కర్‌రెడ్డి, మొయిళ్ల గౌరి, శ్రీనివాసులురెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, నేతలు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, లంకా రామశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ సేవా పోర్టల్, జగనన్నకు చెబుదాం, స్పందన, కమాండ్ కంట్రోల్ విభాగాల నిర్వహణ, తదితర విధులను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన 18 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. సచివాలయ కార్యదర్శులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాను రూపొందించడంతో పాటు ఎన్నికల నిర్వహణను ప్రణాళికబద్ధంగా పూర్తి చేసేందుకు నిర్దేశించిన కార్యాచరణను అమలు చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు చేపట్టనున్న కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్యపర్చి, 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 6, 7, 8 క్లెయిమ్ ఫారాలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు.

యాచకుల సంక్షేమానికి కృషి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందేందుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను నగరంలోని యాచకులకు అందించి వారి సంక్షేమానికి కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. 45వ డివిజన్ పొగతోట, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను ఆయన పరిశీలించారు. సాయిబాబా మందిర ప్రాంగణంలో ఉన్న యాచకులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ శాఖ వారు తొలగిస్తున్న భారీ చెట్ల కొమ్మలను అక్కడే వదిలేస్తున్నారని, ఆ శాఖ అధికారులతో మాట్లాడి పరిశుభ్రం చేసేలా చూడాలని చెప్పారు. నేతాజీ సుబ్బారెడ్డి, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాంలో వచ్చే అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, గ్రామ, వార్డు సచివాలయాల్లో సర్టిఫికెట్ల జారీపై కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి జిల్లా, మండలాధికారులు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం సమీక్షించిన కలెక్టర్ మాట్లాడారు. అర్జీదారుల నుంచి అందే సమస్యలను పూర్తిగా చదివి అర్థం చేసుకొని పరిష్కరించాలని సూచించారు. కొందరు కింది స్థాయి అధికారులు సమస్య పరిష్కారం కాకుండానే పరిష్కారమయ్యాయని చూపుతున్నారని, దీంతో అవి రీ ఓపెన్ అవుతున్నాయని చెప్పారు. జగనన్న సురక్షకు సంబంధించిన సర్వేను త్వరగా పూర్తి చేసి సర్టిఫికెట్లు అందేలా చూడాలని ఆదేశించారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మిత, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని హరనాథపురం, గుర్రాలమడుగు ప్రాంతాల్లో సింగిల్ నంబర్లాటపై బాలాజీనగర్ పోలీసులు దాడులు చేశారు. సింగిల్ నంబర్లాడుతున్న యలమవారిదిన్నెకు చెందిన సుమన్, వెలగచెట్టు సంఘానికి చెందిన చిరంజీవి, గుర్రాలమడుగు సంఘానికి చెందిన వెంకటేష్, ముత్తుకూరు గేట్ సెంటర్‌కు చెందిన సందీప్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.24 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ మాట్లాడారు. తమ ప్రాంతాల్లో నేరాలు జరుగుతున్నాయని గుర్తిస్తే డయల్ 100 లేదా 94407 96311, 94407 00094 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

కమాండ్ కంట్రోల్ ద్వారా మెరుగైన సేవలు



పరిశీలిస్తున్న స్రవంతి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన కమాండ్ కంట్రోల్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందించొచ్చని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ భవనాన్ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. కమాండ్ కంట్రోల్ భవనంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన సాయంతో పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనులను పర్యవేక్షించే అవకాశం ఉంటుందన్నారు. నగరపాలక సంస్థలోని అన్ని విభాగాలతో సమీక్ష సమావేశాలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్, తదితరాలను నిర్వహించేలా కమాండ్ కంట్రోల్ విభాగాన్ని నిర్మించామని చెప్పారు.

ఎస్సీ హాస్టల్లో వసతుల కల్పన



నెల్లూరు (వేదాయపాళెం): బట్వాడిపాళెం, శాంతినగర్‌లోని ఎస్సీ బాలికల హాస్టల్లో డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాన్ని స్నేహితుడి సహకారంతో కల్పించామని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. హాస్టల్లో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. హాస్టల్లో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు మంచినీటి సౌకర్యం లేదని వెల్ఫేర్ ఆఫీసర్ సౌజన్య తమ దృష్టికి తీసుకురావడంతో వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వసతిగృహంలో 150 మంది విద్యార్థులున్నారని, వీరికి అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. అన్నపురెడ్డి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎస్పీ అభినందన



నెల్లూరు(క్రైమ్): ఉత్తమ ప్రతిభ చూపిన పలువుర్ని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తన చాంబర్‌లో బుధవారం అభినందించారు. కావలి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రవి కుమార్తె కీర్తి నీట్‌లో ఆలిండియాలో 83వ ర్యాంక్‌ను సాధించిన క్రమంలో అభినందనలను తెలియజేశారు. చిల్లకూరు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుమారుడు హిమతేజ సౌత్ కొరియాలో ఇటీవల నిర్వహించిన అండర్ – 20 ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సాధించడంతో అభినందించారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో కీర్తి సీటు సాధించడం గర్వకారణమన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలని హిమతేజకు సూచించారు. ఏపీ పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

యువతి స్నానం చేస్తుండగా ఫోన్లో వీడియో

నెల్లూరు(క్రైమ్): యువతి స్నానం చేస్తుండగా ఫోన్లో వీడియో తీసిన యువకుడిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సంతపేటలోని కామాక్షినగర్‌కు చెందిన యువతి నగరంలోని ఓ దుకాణంలో సేల్స్‌గర్ల్‌గా పనిచేస్తున్నారు. షాపు నుంచి ఈ నెల పదో తేదీ రాత్రి ఇంటికొచ్చిన ఆమె బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుండగా, అదే ప్రాంతానికి చెందిన ఉదయ్ కిటికీ ద్వారా ఫోన్లో వీడియో తీస్తుండటాన్ని గమనించి పెద్దగా కేకలేశారు. దీంతో యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

విషయాన్ని తన తల్లికి యువతి తెలియజేశారు. ఫిర్యాదు మేరకు ఎస్సై వేణుగోపాల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రికి పాస్టర్ల కృతజ్ఞతలు

నెల్లూరు(బృందావనం): రాష్ట్రంలోని 3167 మంది పాస్టర్లకు రెండో విడత గౌరవ వేతనాన్ని విడుదల చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా క్రైస్తవ సమాఖ్య నేత రెవరెండ్ దాసరి రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలను తెలియజేశారు. తమకు అండగా నిలవడంపై ఆనందం వ్యక్తం చేశారు.

పలు డివిజన్లలో 'జగనన్న సురక్ష' శిబిరాలు నేడు

నెల్లూరు(బారకాసు): నగరంలోని పలు డివిజన్లలో జగనన్న సురక్ష శిబిరాలను గురువారం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు.

- ఐదో డివిజన్లోని 5 / 1, 2.. ఆరో డివిజన్లోని 6 / 1, 2, 3 సచివాలయాలకు సంబంధించి సత్యనారాయణపురంలో నిర్వహించనున్నారు.
- 45వ డివిజన్లోని 45 / 1, 2.. 46వ డివిజన్లోని 46 / 1, 2, 3 సచివాలయాల పరిధికి సంబంధించి గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని స్వతంత్ర పార్కులో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు.
- 29వ డివిజన్లోని 29 / 1, 2, 3 సచివాలయాల పరిధిలో గల మహాత్మాగాంధీనగర్, 18వ డివిజన్లకు సంబంధించిన 18 / 1, 2, 3 సచివాలయాల పరిధిలోని కావేరినగర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

జనహిత వాత్సల్యలో అన్నదానం

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జనహిత వాత్సల్య చిన్నారులు, వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడారు. ఎస్బీ ఎస్సై వెంకటేశ్వర్లు తన సతీమణి విజయలక్ష్మి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారని చెప్పారు. సాయిభావన, సాయి హరిప్రియ, మానవ సేవే మాధవ సేవ బృంద నిర్వాహకులు పరిమళ, విశ్వనాథం, సురేష్, అక్షయ, ఆశ్రమ సిబ్బంది గిరి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సంతాపం

నెల్లూరు (లీగల్): ఇటీవల మృతి చెందిన నెల్లూరు బార్ అసోసియేషన్‌కు సంబంధించిన నలుగురు న్యాయవాదులకు సంతాప కార్యక్రమాన్ని జిల్లా కోర్టు హాల్లో బుధవారం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని అధ్యక్షత వహించి వారికి సంతాపం ప్రకటించారు. న్యాయవాదులు ఆర్కే శర్మ, తిరువారిపాటి మురళీధర్, పరమేశ్ కుమార్, దాసరి రామకృష్ణప్రసాద్ జీవిత విశేషాలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి వివరించారు. సంతాపంగా కోర్టు కార్యక్రమాలు గంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.

అభివృద్ధిని చూపే ఎన్నికలకు వెళ్తాం



మహిళకు అభివందనం చేస్తున్న అనిల్‌కుమార్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి.. దాని ఆధారంగానే ఎన్నికలకు వెళ్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 8వ డివిజన్లో గల నవాబుపేట సెంటర్, కుమ్మరవీధి, నాగేంద్రనగర్, తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలను ఆరాతీసి వీటిని పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రోడ్లు, డ్రెయిన్లను పూర్తి చేస్తూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని వివరించారు. అన్ని పనులను పూర్తి చేసే బాధ్యతను తీసుకుంటున్నామని చెప్పారు. నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఏ రోజూ వ్యాపారుల వద్ద దందాలు చేయలేదని, వారి జోలికెళ్లలేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలోనే కనిపించే వారిని నమ్మొద్దని, నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్న వారి గురించి ఆలోచించాలని కోరారు. కార్పొరేటర్ మొగళ్లపల్లి కామాక్షిదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఆర్ఎంలో కలెక్టర్ తనిఖీ



నెల్లూరు (టౌన్): మూలాపేటలోని ఈఎస్ఆర్ఎం హైస్కూల్‌ను కలెక్టర్ హరినారాయణన్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల వివరాలను ఆరాతీశారు. చైల్డ్ ఇన్ఫో మేరకు విద్యా కానుక, అమ్మ ఒడి, తదితర పథకాలను అందించారాననే అంశాన్ని తెలుసుకున్నారు. సీఆర్ యాప్ ఆధారంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సర్వే చేపట్టి బడి – ఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండేలా చూడాలని చెప్పారు. అనంతరం అరవింద్‌నగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలను పరిశీలించారు. కమిషనర్ వికాస్ మర్మత్, డీఈఓ గంగాభవానీ, ఆర్ఐఓ శ్రీనివాసులు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఎంఈఓ తిరుపాల్, ప్రధానోపాధ్యాయుడు శివరామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణంలో పరిశీలన



నెల్లూరు (వేదాయపాళెం): గాంధీనగర్‌లోని నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికార కేంద్రాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ బుధవారం పరిశీలించారు. మహిళా ప్రాంగణంలో మహిళలకు అందుతున్న సేవలపై జిల్లా మేనేజర్ మాధవిని అడిగి తెలుసుకున్నారు. మహిళలకు స్వయం ఉపాధి, శిక్షణ కార్యక్రమాలకు తమ వంతు తోడ్పాటును అందిస్తామని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్చక గ్రీవెన్స్‌లో 15 సమస్యలకు పరిష్కారం



నెల్లూరు(బృందావనం): జిల్లా పరిధిలో అర్చకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అర్చక గ్రీవెన్స్‌లో పరిష్కరించారని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదాచార్యులు, ఉదయగిరి వెంకటశేషాచార్యులు పేర్కొన్నారు. సర్వోదయ కళాశాల ప్రాంగణంలో సమావేశాన్ని దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జిల్లాలోని 15 ఆలయాల్లో అర్చకులకు నిబంధనల మేరకు జీతాలను పెంచడంతో పాటు పలు ఆలయాల్లో అర్చకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించారు. జిల్లా అర్చక సమాఖ్య నేతలు శ్రీనివాసశర్మ, ఫణికుమార్, విజయరాఘవ, మణిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

దేవదాయ శాఖలో అర్చకులకు ఉద్యోగ విరమణ లేకుండా దేవదాయ చట్టం 30 / 87కు సవరణ చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరాంకుశం ప్రసాదాచార్యులు, ఉదయగిరి వెంకటశేషాచార్యులు,, నేతలు గుడ్లూరు ఫణికుమార్‌శర్మ, విజయరాఘవాచార్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. సీఎంకు అర్చకులు రుణపడి ఉంటారని చెప్పారు.

స్కూల్ బ్యాగుల అందజేత



నెల్లూరు(బృందావనం): మద్రాస్ బస్టాండ్ సమీపంలో రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల కేంద్రంలో 100 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను బుధవారం పంపిణీ చేశారు. హిందూ ధార్మిక వేద పరిరక్షణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రస్ట్ చైర్మన్ రవిశర్మ, కార్యదర్శి మాధవశర్మ, కోశాధికారి కార్తీక్, సభ్యులు మహేష్‌శర్మ, వంశీకృష్ణ, రామకృష్ణశర్మ, క్రాంతి, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.